క్లుప్తంగా

విద్యార్థులకు దంత వైద్య పరీక్షలు



ఇబ్రహీంపట్నం: విద్యార్థులు దంత సంరక్షణ చర్యలు తీసుకోవాలని దంతవైద్య నిపుణులు ఈదర విశ్వాస్ అన్నారు. మెరీడియన్ పాఠశాలలో విద్యార్థులకు మాసాంతపు దంత పరీక్షల శిబిరం ఆయన నిర్వహించారు. విద్యార్థులు దంత క్షయం లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. దంత సంరక్షణతో చిగుళ్ల వ్యాధులు దరిచేరవన్నారు. అనంతరం డాక్టర్ కందిమళ్ల నైమిషతో కలిసి విద్యార్థులకు దంత పరీక్షలు చేసి టూత్ పేస్టులు పంపిణీ చేశారు. పాఠశాల కరస్పాండెంట్ శ్రీధర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

105 మందికి కంటి వైద్యం

విస్సన్నపేట: స్థానిక లయన్స్‌క్లబ్ ఆఫ్ విస్సన్నపేట ఆధ్వర్యంలో లయన్స్‌క్లబ్ మల్టీ హాలులో ఉచిత కంటి వైద్యశిబిరం సోమవారం నిర్వహించారు. ఈ శిబిరంలో నూజివీడు గిఫర్డ్ మెమోరియల్ (అమెరికన్) హాస్పటల్ కంటి వైద్యులు డాక్టర్ దత్తం రోగులకు కంటి పరీక్షలు నిర్వహించారు. 105 మందిని పరీక్షించి 45 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వారికి నూజివీడు అమెరికన్ హాస్పటల్‌లో ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహిస్తామని క్లబ్ అధ్యక్షుడు వేమూరి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సీనియర్ సభ్యులు ఎన్‌టి.వెంకటేశ్వరరావు, బొమ్మారెడ్డి రామిరెడ్డి, తుమ్మూరు వెంకటరెడ్డి, జాన్‌బాబు, జగన్‌మోహనరెడ్డి పాల్గొన్నారు.

బస్టాండ్‌లో సౌకర్యాలు మెరుగు పరచాలి

తిరువూరు: స్థానిక ఆర్టీసీ బస్టాండులో ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సీపీఐ నాయకులు సోమవారం డిపో మేనేజరు వేణుకు వినతిపత్రం సమర్పించారు. ప్రయాణికులు వేచివుండే ప్లాట్‌ఫారాల వద్ద లైట్లు వెలగక, ఫ్యాన్లు తిరగక ఇబ్బంది పడుతున్నారని, బస్టాండు ఆవరణలో లైట్లు లేక రాత్రి వేళ అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. తాగునీరు సరఫరా చేయాలని, మరుగుదొడ్ల నిర్వహణ మెరుగుపరచాలని కోరారు. సీపీఐ నాయకులు షేక్ నాగుల్‌మీరా, షేక్ సుబానీ, మాలపాటి ఉదయ్, మస్తాన్, అశోక్ పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): స్కౌట్, గైడ్ శిబిరాల్లో విద్యార్థుల్లో సేవాభావం, నాయకత్వ లక్షణాలు అలవడతాయని వ్యాగన్ వర్క్‌షాప్ చీఫ్ మేనేజర్ ఎస్.శ్రీనివాస్ అన్నారు. గుంటుపల్లి కేంద్రియ విద్యాలయంలో స్కౌట్, గైడ్ శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. శిబిరంలో పాల్గొనే విద్యార్థులు మానవత్వం, సహనం కలిగి ఉండాలని ఆకాంక్షించారు. ప్రిన్సిపాల్ పీవీఎస్ఎస్ఆర్ కృష్ణ మాట్లాడుతూ ఖమ్మం నుంచి మచిలీపట్నం, కాకినాడ నుంచి తెనాలి వరకు 14 కేంద్రీయ విద్యాలయాలకు చెందిన సుమారు 200 మంది స్కౌట్, గైడ్స్ పాల్గొన్నట్లు తెలిపారు. వీరికి ప్రథమ చికిత్స, ఫైర్ సేఫ్టీ, మంటలేని వంట, కంపాస్, నాటింగ్ అంశాలపై నైపుణ్య శిక్షణ ఇస్తామన్నారు. క్యాంపు లీడర్ రమేష్‌బాబు, ఎల్‌వోసీ అనూరాధ, తదితరులు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

చంద్రాల(మైలవరం): మండలంలోని చంద్రాల గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇల్లు దగ్ధమైన సంఘటన సోమవారం జరిగింది. చంద్రాల గ్రామంలో గుణదల రామకృష్ణకు చెందిన తాటాకు ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా నిప్పులు చెలరేగి దగ్ధమైంది. ఇంట్లోని వస్తువులు అన్నీ అగ్నికి ఆహుతయ్యాయి. ఆస్తి నష్టం సుమారు రూ.6 లక్షల వరకు ఉంటుందని కుటుంబ సభ్యులు తెలిపారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ గంగాధరరావు బాధితులను పరామర్శించి, వివరాలు తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందేలా చూస్తామని గంగాధరరావు తెలిపారు.

ముగిసిన సంకల్ప సప్తాహ్ వారోత్సవాలు

ఇబ్రహీంపట్నం: కేంద్ర ప్రభుత్వం అభిలషణీయం బ్లాక్ పథకంలో భాగంగా ఏర్పాటు చేసిన సంకల్ప సప్తాహ్ వారోత్సవాలు సోమవారంతో ముగిశాయి. వారంరోజుల పాటు విద్య, వ్యవసాయం, వ్యాపార రంగం, అభివృద్ధి, కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై సమీక్షలు జరిపారు. ఆయా బ్లాక్‌లలో నివశిస్తున్న ప్రజలు, ప్రజా ప్రతినిధులతో సమీక్షలు నిర్వహించి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించే దిశగా అవగాహన కల్పించారు. ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న మండల పరిషత్ కార్యాలయంపై వేయించిన గాంధీ పెయింటింగ్ ప్రజాప్రతినిధులు, అధికారులతో కలసి ఆవిష్కరించారు. ఎంపీడీవో రామకృష్ణ నాయక్, తహసీల్దార్ శ్రీనివాసరావు, వైఎస్ ఎంపీపీలు బండి నాగమణి, బాణావత్ నాగబాలమ్మ, పాలడుగు దుర్గాప్రసాద్, సర్పంచులు, ఎంపీటీసీలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండ 'జగనన్న ఆరోగ్య సురక్ష'



చొప్పరమెట్లలో కిట్‌ను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు, వైద్యులు

ఏ.కొండూరు: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం నిరుపేదలకు అండగా నిలుస్తుందని జెడ్పీటీసీ భూక్య గనియా, సర్పంచ్ పర్వతనేని నాగమల్లేశ్వరి పేర్కొన్నారు. మండలంలోని కృష్ణారావుపాలెం గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు పర్వతనేని చంద్రమోహనరావు, సర్పంచ్ జరబల జమలయ్య, పెద్దబాబు, తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ వెంకటేష్‌నాయక్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు స్వాతి, పలువురు పాల్గొన్నారు.

650 మందికి వైద్య పరీక్షలు

జూపూడి(ఇబ్రహీంపట్నం): మండలంలోని జూపూడి గ్రామ సచివాలయం వద్ద సోమవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరాన్ని ఎంపీడీవో రామకృష్ణనాయక్, గ్రామ సర్పంచి కాకి దేవమాత ప్రారంభించారు. వైద్య సిబ్బంది మధుమేహం, బీపీ, రక్త పరీక్షలు జరిపారు. పలువురు వైద్యులు 650 మందికి సాధారణ వ్యాధులు, గైనకాలజీ, కంటి, నరాల సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈసీజీ తీసి సమస్యను బట్టి కార్పొరేట్ వైద్యశాలకు సిఫారసు చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార పదార్థాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీ మెడికల్ అధికారి శ్రీనివాస్, దుర్గమ్మ ఆలయ కమిటీ సభ్యుడు చింకా శ్రీనివాసరావు, సీహెచ్‌వో నారాయణ, పంచాయతీ కార్యదర్శి అనీల్, పలువురు వైద్యులు, సచివాలయ ఉద్యోగులు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విస్సన్నపేట: విస్సన్నపేట గ్రామ సచివాలయం-1 పరిధిలో స్థానిక జిల్లాపరిషత్ హైస్కూల్ వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. వైద్యశిబిరాన్ని పరిశీలించిన సర్పంచ్ గ్రామ సర్పంచ్ సాధుపాటి నాగమల్లేశ్వరి మాట్లాడుతూ ప్రజారోగ్యం కొరకు అనేక పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. ఎంపీడీఓ ఎస్ వెంకటరమణ, తహసీల్దార్ చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ జిల్లా కమిటీ సభ్యుడు సిరసాని ప్రకాష్, పట్టణ అధ్యక్షుడు నెక్కళపు కుటుంబరావు, ఉపసర్పంచ్ మండపాటి సత్యనారాయణరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు రెడ్డి ముత్యాలరావు, కోఆప్షన్ మాజీ సభ్యుడు దస్తగిరి, వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మేడూరు(గంపలగూడెం): మండలంలోని మేడూరులో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. మెడికల్ క్యాంప్‌లో గంపలగూడెం, ఊటుకూరు, తిరువూరు పీహెచ్‌సీల వైద్యులు సురేష్, వాసవి, శశిప్రియ, పిల్లల వైద్యనిపుణులు వాసవిలు 863 మంది రోగులను పరీక్షించారు. అవసరమైన మందులను అందజేశారు. శిబిరంలో ప్రధానంగా 77 మందికి గుండెకు సంబంధించిన పరీక్షలు చేశారు. మేడూరు సచివాలయం పరిధిలోని సత్యాలపాడు, మేడూరు గ్రామస్తులు ఈశిబిరాన్ని వినియోగించుకొన్నారు. పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తూ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార స్టాల్ ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి, మేడూరు ఉపసర్పంచ్ నాగోలు కనకమ్మ, సత్యాలపాడు సర్పంచ్ వీ గోవర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు కామసాని విజయనిర్మల, వైఎస్సార్ సీపీ నాయకులు నల్లగట్ల బాలు, శంకర్‌రెడ్డి, తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, ఎంఈఓ పీవీడీఎల్ నరశింహారావు, సచివాలయ సిబ్బంది, ఆరోగ్య, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



జూపూడిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



విస్సన్నపేటలో వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న సర్పంచ్ నాగమల్లేశ్వరి, అధికారులు

వెల్వడం(మైలవరం): ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ లక్ష్మీకుమారి తెలిపారు. మైలవరం మండలం వెల్వడం గ్రామంలో సర్పంచ్ ప్రత్తిపాటి ధర్మరాజు అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం సోమవారం జరిగింది. ఎంపీడీఓ లక్ష్మీకుమారి మాట్లాడుతూ పేదలకు ఈ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు. గ్రామ సర్పంచ్ ప్రత్తిపాటి ధర్మరాజు మాట్లాడుతూ ప్రజల ముంగిటకే వైద్యం తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌దే అన్నారు. ప్రజలు ఆరోగ్య పరీక్షలు చేయించుకుని తమ సమస్యలను వైద్యులకు తెలియజేసి చికిత్స తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు అంబటి లక్ష్మీ, ఉదయ భాస్కర్ రెడ్డి, పాలంకి వెంకటేశ్వరరెడ్డి, చంద్రాల పీహెచ్‌సీ వైద్యులు ప్రియాంక, అరుణకుమారి, స్పెషలిస్ట్ వైద్యులు, పంచాయతీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, వాలంటీర్స్, గ్రామస్తులు పాల్గొన్నారు.

చాట్రాయి: మండలంలోని జనార్దనవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సర్పంచ్ పామర్తి ఝాన్సీ సోమవారం ప్రారంభించారు. ఐసీడీఎస్ పోషక ఆహారం స్టాల్‌లో తయారు చేసిన పదార్థాలను తిలకించారు. పీహెచ్‌సీ వైద్యాధికారిణి విజయలక్ష్మి, వి.భానుకిరణ్ (ఆర్థోపెడిక్), డాక్టర్ అరవింద్ (జనరల్), పీహెచ్‌సీ డాక్టర్ దుర్గా ప్రసాదు 312 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పామర్తి నాగేశ్వరావు, ఎంఈవో బ్రహ్మచారి, అంగన్‌వాడీ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

నేడు కలగరలో జగనన్న ఆరోగ్య సురక్ష

విస్సన్నపేట: మండలంలోని కలగర సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం స్థానిక ఎంపీయూపీ పాఠశాలలో మంగళవారం ఉదయం నిర్వహించనున్నారు. సంబంధిత వైద్యులు ఉచితంగా అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తారు. ప్రజలు ఈ వైద్యశిబిరాన్ని సద్వినియోగించుకోవాలని ఎంపీడీఓ ఎస్ వెంకటరమణ సోమవారం తెలిపారు.

నేడు పోలసానపల్లిలో..

నూజివీడు: మండలంలోని పోలసానపల్లిలో ఈనెల 10న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వీఏ విజయ్‌కుమార్ సోమవారం తెలిపారు. గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు వైద్యులు ప్రజలకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందజేస్తారన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి మెరుగైన చికిత్స నిమిత్తం వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో భాగంగా విజయవాడలోని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రిలకు రిఫర్ చేస్తారన్నారు. ప్రజలు ఈ వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో విజ్ఞప్తి చేశారు.

నూజివీడు(ఆగిరిపల్లి): మండలంలోని చొప్పరమెట్లలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 325 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. వైస్ ఎంపీపీ గడ్డం సాంబశివరావు, ఆగిరిపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి జాస్తి జగన్‌మోహన్‌రావు, సర్పంచి కూరాకుల ఊర్మిళ, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు పల్లగాని కోటేశ్వరరావు, ఎంపీడీవో శంకరరావు, ఎంఈవో కొవ్వలి ఆనంద్‌కుమార్, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

ముసునూరు: జగనన్న ఆరోగ్య సురక్ష మండల టీమ్-1 అధికారి ఎంపీడీఓ జి.రాణి అధ్యక్షతన సోమవారం చింతలవల్లి ఎంపీపీ స్కూల్లో జగనన్న ఆరోగ్య సురక్ష గ్రామ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు కరీముల్లా, కిరణ్ కుమార్, అవినాష్, ప్రత్యేక వైద్య నిపుణులు ప్రవీణ్, పిల్లల వైద్య నిపుణులు ఎడ్విన్ రాజ్ 549 మందికి వైద్య పరీక్షలు, 190 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. ఐదుగురిని మెరుగైన వైద్యం కోసం నూజివీడుకు రిఫర్ చేశారు. సర్పంచ్ సత్యనారాయణ, ఎంపీటీసీ పి.సుధాకర్ 12 మందికి కళ్ల జోళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బీవీ సుబ్బారావు, ఈఓపీఆర్డీ సత్యనారాయణ, కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్ వైజర్ ధనలక్ష్మి, వైద్యశాఖ, సచివాలయాల, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



జగనన్న ఆరోగ్య సురక్ష కిట్‌ని అందజేస్తున్న సర్పంచ్



చింతలవల్లిలో వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది



వెల్వడం వైద్య శిబిరంలో ఎంపీడీవో లక్ష్మీకుమారి, సర్పంచ్ ధర్మరాజు, వైద్యులు,

మిర్చి రైతుల్ని ఆదుకోవాలి

మంత్రి కాకాణికి తిరువూరు ఎమ్మెల్యే వినతి



వ్యవసాయ శాఖామంత్రికి సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

తిరువూరు: తిరువూరు నియోజకవర్గంలో తెగుళ్ల సోకి మిర్చి పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డిని తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి కోరారు. సోమవారం విజయవాడలో మంత్రిని కలిసిన రక్షణనిధి రైతుల ఇబ్బందులను వివరించారు. తిరువూరు, గంపలగూడెం, ఏ.కొండూరు మండలాల్లో మిర్చి పంటకు సోకిన తెగుళ్ల వలన రెండుసార్లు నారు పోయవలసి వచ్చిందని, ఈ క్రాప్‌లో నమోదు చేసినందున పంటలకు పరిహారం మంజూరు చేయాలని కోరారు.

యూపీ స్కూల్లో వార్షిక తనిఖీ



కొర్లగుంట యూపీ స్కూల్లో తనిఖీ నిర్వహిస్తున్న ఎంఈఓ

ముసునూరు: ఉపాధ్యాయులు ప్రణాళిక ప్రకారమే పాఠ్యాంశాలను బోధించాలని ఎంఈఓ బీవీ సుబ్బారావు సూచించారు. కొర్లగుంట ప్రాథమికోన్నత పాఠశాలలో ఆయన అధ్యక్షతన సోమవారం వార్షిక తనిఖీ నిర్వహించారు. ప్రతి సబ్జెక్టుకు సంబంధించిన విషయాలను ఆయా తరగతుల్లో పాఠ్యాంశాల బోధనపై తనిఖీ చేశారు. విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి, క్రమశిక్షణతో విద్యాభ్యాసం చేయాలని సూచించారు. ఉపాధ్యాయులంతా సమకాలీన పోటీ పరిస్థితులకు అనుగుణంగా, పాఠ్య ప్రణాళిక ప్రకారమే విద్యా బోధన చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. బోధనోపకరణాలతో బోధించేలా చూడాలని హెచ్.ఎం వరలక్ష్మికి సూచించారు. పాఠశాల రికార్డులు, మధ్యాహ్న భోజన పథకం రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గాంగేయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రవి

మైలవరం: విద్యార్థులకు చదువుతో పాటు ఇతర రంగాలపై అవగాహన ఉండాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భౌతిక శాస్త్రం విభాగం ఆధ్వర్యంలో వరల్డ్ స్పేస్ వీక్ వారోత్సవాల్లో భాగంగా సోమవారం పవర్ పాయింట్ ప్రజెంటేషన్స్ పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచంలో భౌతిక శాస్త్రానికి ఎంతో ప్రాముఖ్యత ఉందన్నారు. అంతరిక్ష పరిశోధనలకు భౌతిక శాస్త్రం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. విద్యార్థులు భౌతిక శాస్త్రంపై అవగాహన పెంచుకుని సమాజానికి ఉపయోగపడాలన్నారు. ప్రదర్శనలో విద్యార్థులు విశ్వ రహస్యాలను కళ్లకు కట్టినట్లు పవర్ ప్రజెంటేషన్ ద్వారా చూపించారు. సుమారు 20 ప్రదర్శనలు జరిగాయి. న్యాయ నిర్ణేతలుగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పీ రంగారావు, డాక్టర్ జే రాముడు వ్యవహరించారు. ప్రథమ బహుమతి ప్రియాశ్రీవల్లి, ద్వితీయ బహుమతి సమీర, లీల, తృతీయ బహుమతి వెన్నెల గెలుచుకున్నారు. విజేతలను ప్రిన్సిపాల్ డాక్టర్ రవి అభినందించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమాన్ని భౌతిక శాస్త్ర విభాగాధిపతి వి.ఉమాలక్ష్మి పర్యవేక్షించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మీర్జాపురం హైస్కూల్ విద్యార్థినుల ప్రతిభ



కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ నుంచి బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

నూజివీడు: మండలంలోని మీర్జాపురం హైస్కూల్ విద్యార్థినులు ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చేతుల మీదుగా సోమవారం సర్టిఫికెట్లు, నగదు ప్రోత్సాహాన్ని అందుకున్నారు. హెచ్ఐవీపై అవగాహన నిమిత్తం నేషనల్ యూత్ ఫెస్ట్-2023లో భాగంగా జిల్లా స్థాయిలో వైద్యశాఖ నిర్వహించిన క్విజ్ పోటీల్లో హైస్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థినులు జీ త్రివేణి, ఎల్.జాయిసి రాణి కన్సోలేషన్ బహుమతిని పొందారు. వీరికి కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ రూ.2 వేల నగదు బహుమతిని, సర్టిఫికెట్లను అందజేశారు. విద్యార్థినులకు గైడ్‌గా వ్యవహరించిన సైన్సు ఉపాధ్యాయిని బీ అరుణను కలెక్టర్ అభినందించారు. ప్రతిభ చూపిన విద్యార్థినులను హెచ్ఎం.డీవీఎల్ పుష్పలత, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

ఇరువురికి గాయాలు

తిరువూరు: తిరువూరులోని విజయవాడ-జగదల్‌పూర్ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఇరువురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం ఎదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీకొనగా, ఇరువురు యువకులు రోడ్డుపై పడిపోయారు. అదే సమయంలో విజయవాడ నుంచి తిరువూరు వస్తున్న ఆర్టీసీ బస్సు వారిని ఢీకొంది. తిరువూరు మండలం రోలుపడికి చెందిన బర్రె సుధీర్‌కు వీపు భాగంలో తీవ్రగాయం కాగా, విజయవాడకు చెందిన మరొక యువకుడి కాలు ఛిద్రమవడంతో విజయవాడ తరలించారు. బస్సు డ్రైవరును పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. సుధీర్ స్థానిక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు



జి.కొండూరు: కుటుంబ కలహాల కారణంగా వివాహిత అదృశ్యం కాగా జి.కొండూరు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కందులపాడు గ్రామానికి చెందిన వీసం ప్రభుదాసుకు వీరులపాడు మండలం జమ్మవరానికి చెందిన రమణతో 20 సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె. అయితే గత కొంతకాలంగా భార్యా, భర్తలిద్దరూ తరచూ గొడవ పడుతూ ఉండేవారు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన రమణ గత శనివారం ఇంటి నుంచి వెళ్లిపోయి తిరిగిరాలేదు. రమణ ఆచూకీ కోసం ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో రమణ భర్త ప్రభుదాసు సోమవారం జి.కొండూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ధర్మరాజు పేర్కొన్నారు.

అర్జీలను గడువులోగా పరిష్కరించాలి

సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్



నూజివీడులో అర్జీదారుల సమస్య వింటున్న సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

నూజివీడు: స్పందనలో వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులు గడువులోగా పరిష్కరించాలని సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ సూచించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం సబ్ కలెక్టర్ స్పందన కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కారమవుతాయని ఎంతో నమ్మకంతో స్పందనలో అర్జీలను అందజేస్తున్నారని, వాటిని తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. పరిష్కరించడానికి వీలుకాకపోతే దానికి గల కారణాన్ని అర్జీదారుడికి తెలపాలన్నారు. డివిజన్ స్థాయి అధికారులు స్పందన కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. స్పందనలో 20 అర్జీలు రాగా వీటిలో ఎక్కువగా రెవెన్యూ సంబంధ సమస్యలున్నాయి. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీవో వెంకటరత్నం, డీఎల్‌పీవో సుందరి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ భాస్కరరెడ్డి, ఆర్‌అండ్‌బీ ఏఈ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు చేయించాలి

నూజివీడు(ఆగిరిపల్లి): రైతులు తాము సాగుచేసిన పంటలను ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని సబ్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు. ఆగిరిపల్లి మండలంలోని వడ్లమానులో ఈ క్రాప్ బుకింగ్ ప్రక్రియను సోమవారం సబ్ కలెక్టర్ పరిశీలించారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులు ఈ క్రాప్ బుకింగ్‌ను చేస్తున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఈనెల 10వ తేదీతో ఈ క్రాప్ బుకింగ్ చేసేందుకు గడువు పూర్తవుతున్నందున రైతులు త్వరితగతిన ఈకేవైసీ చేయించుకోవాలన్నారు. లేనిపక్షంలో ధాన్యాన్ని విక్రయించుకోవాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. తహసీల్దార్ ఉదయభాస్కర్, వ్యవసాయాధికారి పలగాని చెన్నారావు, వీఆర్వోలు, వ్యవసాయశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పథకాలు సద్వినియోగం చేసుకోండి



రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ చైర్మన్ జాన్‌వెస్లీని సత్కరిస్తున్న పాస్టర్స్ ఫెలోషిప్ సభ్యులు

కొటికలపూడి(ఇబ్రహీంపట్నం): రాష్ట్ర ప్రభుత్వం క్రిస్టియన్ మైనార్టీ సంఘాలకు అందిస్తున్న పథకాలు పాస్టర్లు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ చైర్మన్ జాన్‌వెస్లీ అన్నారు. మండలంలోని కొటికలపూడిలో జరిగిన మండల పాస్టర్స్ ఫెలోషిప్ సర్వసభ్య సమావేశంలో ఆయన సోమవారం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వం నూతన చర్చిలు, శ్మశాన వాటికల నిర్మాణానికి సహకారం అందిస్తుందన్నారు. గౌరవ వేతనం రానివారు దరకాస్తు చేసుకోవాలన్నారు. రాష్ట్ర శ్రేయస్సు కోసం పాస్టర్లు ప్రార్థించాలని తెలిపారు. జాన్ వెస్లీని ఘనంగా సన్మానించారు. పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్ష, ఉపాధ్యక్షుడు ప్రభుదాస్, స్టీవెన్, పాస్టర్లు ఎలీషా, సుభాకర్, మోజెస్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ప్రతినిధుల సభలో..



విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో వైఎస్సార్ సీపీ ప్రతినిధుల సభ సోమవారం జరిగింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, కైకలూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి, నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. –సాక్షి, ఫొటోగ్రాఫర్ విజయవాడ



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన



ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలిస్తున్న తహసీల్దార్ విశ్వనాథరావు

చాట్రాయి: ప్రకృతి వ్యవసాయంపై రైతులు ఆసక్తి చూపాలని తహసీల్దార్ విశ్వనాథరావు తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ పంట ఉత్పత్తుల ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ ఎరువులతో పండించిన పంట ఉత్పత్తులు ఆరోగ్యానికి ఎంతో దోహదపడతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.